క్లుప్తంగా

కరెంటు ఉండని ప్రాంతాలు



మల్కాజిగిరి: వినాయకనగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఓల్డ్ సఫిల్‌గూడ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతులు జరుగుతాయని ఏఈ కళ్యాణి తెలిపారు. దీన్‌దయాళ్‌నగర్, వినాయకనగర్ బ్లాక్–4, ఓల్డ్ సఫిల్‌గూడ, వీవీ గార్డెన్స్, సుధానగర్, 11 కేవీ శారదానగర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినాయకనగర్ బ్లాక్–1, అనంత్‌నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, చంద్రగిరి కాలనీ, సూర్యనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చర్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

కుషాయిగూడ: ఉన్నతాధికారుల సూచన మేరకు చర్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో బుధవారం కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పృథ్వీరాజ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నాగారం ఫీడర్ పరిధిలోని రెడ్డికాలనీ, భగవాన్‌కాలనీ, చక్రిపురం, కట్టింగ్‌కాలనీ, టీచర్స్‌కాలనీ, మారుతీకాలనీ, గాంధీనగర్, మధురనగర్, ద్వారకాపురినగర్ కాలనీల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాయినగర్ ఫీడర్ పరిధిలోని రెడ్డికాలనీ, సుభాష్‌నగర్ కాలనీ, కృష్ణారెడ్డినగర్, సాయినగర్, నాగర్జున నగర్‌కాలనీ రోడ్డు నెంబర్లు 2, 3, 4, 5, 6, చక్రిపురం, ఇందిరానగర్ కాలనీల్లో కరెంటు ఉండదని తెలిపారు.

మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలో..

మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మంగళవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కైలాసగిరి ఫీడర్ పరిధిలోని మంగపురంకాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీ ఫస్ట్‌ఫేస్, ఇందిరానగర్, లక్ష్మీనగర్, రాజీవ్‌గాంధీనగర్, భక్షిగూడ, నవోదయనగర్, కైలాసగిరి ప్రాంతాల్లో కరెంటు ఉండదని తెలిపారు.

చిలుకానగర్ డివిజన్ పరిధిలో..

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రశాంత్‌నగర్, బీరప్పగడ్డ, అన్నపూర్ణ కాలనీ, బ్యాంక్ కాలనీ, ధర్మపురి కాలనీ, శ్రీరాంనగర్, ఈస్ట్ కళ్యాణపురి, రాఘవేంద్రా కాలనీ, శ్రీగిరి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నేటి నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు బంగారు మైసమ్మ దేవాలయం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ గుర్రాల రమ

బోడుప్పల్: పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇందిరానగర్ కాలనీవాసి బి.శివకుమార్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం ఆమె అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు గుర్రాల వెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మైనార్టీ రెసిడెన్షియల్ విద్యార్థి ప్రతిభ

మల్లాపూర్: జేఈఈ మెయిన్స్ సేషన్–1 ఫలితాల్లో తమ విద్యార్థి ద్వితీయ సంవత్సరం (ఎంపీసీ) చదువుతున్న షేక్ షేకీనా బేగం జాతీయ స్థాయిలో 83 శాతంతో ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్(ఉప్పల్ గర్ల్స్) నాచారం కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రేష్మా హుస్సేన్ అన్నారు. కాలేజీలో కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శుక్లా, లక్ష్మారెడ్డి మంగళవారం షేక్ షేకీనా బేగంను అభినందించారు.



షేక్ షేకీనా బేగంను అభినందిస్తున్న ప్రిన్సిపల్, కాలనీవాసులు.

ఫిర్యాదులు ఫుల్ పరిష్కారాలు నిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం (ఫైల్)

- ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల్లో 10 నెలలుగా 948 పెండింగ్ దరఖాస్తులు
- పనితీరుకు ప్రజా ఫిర్యాదుల విభాగమే ప్రామాణికం
- పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్‌కు ప్రజల మొర
- ఇన్‌చార్జిల నుంచి రెగ్యులర్ పాలన వచ్చినా.. మారేనా తీరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజావాణి ఫిర్యాదులకు దిక్కులేకుండా పోయింది. మహానగరం హైదరాబాద్ జిల్లా తర్వాత అత్యధిక జనాభా కలిగినా అతిపెద్ద జిల్లాగా మేడ్చల్–మల్కాజిగిరికి పేరు ఉంది. రెవెన్యూ శాఖ పరంగా ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివాదాలు, కోర్టు కేసులు కూడా అధికంగానే ఉన్నాయి. మరోపక్క హైదరాబాద్ మహా నగరానికి సమాంతరంగా శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. పైగా తెలంగాణలో ఎక్కడా లేని విధంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 4 నగర పాలక సంస్థలు, 9 మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ పరిధిలోని దాదాపు 12 మున్సిపల్ సర్కిళ్లు, 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో పయనిస్తున్న జిల్లా పరిశ్రమలకు కేంద్రంగా తెలంగాణలో వర్ధిల్లుతోంది.

ప్రజావాణి అంటే...

కలెక్టరేట్‌లో ప్రజావాణి అంటే జిల్లా కలెక్టర్ సహా అదనపు కలెక్టర్లు, డీఆర్వో, ఆర్డీవోలతో పాటు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు అందుబాటులో ఉండాలి. ప్రజా సమస్యలను స్వీకరించే ఫిర్యాదులను కలెక్టర్ అక్కడిక్కడే పరిష్కరిస్తారు. అవసరమైతే.. అప్పుడే అక్కడున్న సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటారన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది.

షరా మామూలే అన్నట్లుగా...

కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం అధికారుల పని తీరుకు అద్దం పడుతోంది. ప్రజావాణి ప్రారంభం కాగానే అరగంట పాత(పెండింగ్) దరఖాస్తులపై సమీక్ష ఉంటుంది. పాత వాటిలో పరిష్కారమైనవి ఎన్ని? కాని వాటికి గల కారణాలేంటనే దానిపై అక్కడే చర్చ జరుగుతుంది. కొంత కాలంగా ఆ విధానం జిల్లాలో నిలిచిపోయింది. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ కార్యాలయాల్లో న్యాయం జరగక ప్రజావాణికి వచ్చే బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రజావాణికి కలెక్టర్ హాజరు కాకపోతే.. పట్టించుకోవడం అనేది షరా మామూలే అన్నట్లుగా ఉంటోంది. ప్రజల గోడు వినేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రజావాణికి నెలల తరబడి కలెక్టర్లు హాజరు కాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అదే పరిస్థితి మేడ్చల్ ప్రజావాణిలో కనిపిస్తోంది. దీంతో ప్రజావాణి వినతులకు మోక్షం లభించకపోగా.. వాటి పరిష్కారం ఏ స్థితిలో ఉందన్న విషయం కూడా ఫిర్యాదుదారులకు తెలియక ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న సందర్భాలు అనేకంగా ఉన్నాయి.

పెండింగ్ దరఖాస్తులెన్నో...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దాదాపు రెండేళ్ల ఇన్‌చార్జి కలెక్టర్ల పాలనలో కొనసాగడం వల్ల ప్రజావాణి ఫిర్యాదులకు మోక్షం లభించడం లేదన్న అపవాదును ఎదుర్కొంటోంది. 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు దాదాపు 10 నెలల కాలంలో ప్రజావాణిలో 2313 ఫిర్యాదులు రాగా ఇప్పటి వరకు 1365 మాత్రమే పరిష్కారానికి నోచుకొనగా, 948 ఫిర్యాదులు ఇంకా పెండింగ్‌లోనే మగ్గుతున్నాయి. ధరణి పోర్టల్‌కు సంబంధించిన దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా రావడంతో సులభంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ధరణికి సంబంధించిన 2342 దరఖాస్తులు ఎలాంటి పరిష్కారానికి నోచుకొనకుండా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. పెండెన్సీలో ఉన్న ఫిర్యాదుల్లో రెవెన్యూ, ధరణికి అక్రమ కట్టడాలకు సంబంధించిన దరఖాస్తులు 60 శాతం ఉండగా, మిగతా శాఖలకు చెందినవి 40 శాతం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్ని సార్లు.. విన్నవించినా..

కలెక్టరేట్ ప్రజావాణిలో వ్యయ, దూర భారానికి ఓర్చి తమ సమస్యలపై దరఖాస్తు పెట్టుకున్నా.. పరిష్కారానికి నోచుకోవడం లేదని బాధిత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రతీ సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు తమ సమస్యలను మొర పెట్టుకున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారని వారు ఆరోపిస్తున్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 'సైక్లాథాన్' కార్యక్రమాన్ని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డా.పుట్ట శ్రీనివాస్ ప్రారంభించారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సైకిల్ తొక్కి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రతినెలా 14న యోగా, సైక్లింగ్‌పై అవగాహన కల్పించనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. అనంతరం టీబీ రోగులకు మందులను పంపిణీ చేశారు. ఉప్పల్ వైద్యాధికారి డా.సౌందర్య లత, ప్రకాశ్, సిగ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ.

ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రంలో మంగళవారం ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం–3194, ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్–7852 అనుబంధ సంఘం డైరీని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డా.పుట్ట శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ తొక్కుతున్న జిల్లా వైద్యాధికారి డా.పుట్ట శ్రీనివాస్ తదితరులు

ఆరోగ్యమే బహుమతి

సాక్షి, సిటీబ్యూరో: ప్రేమికులు ఆరోగ్యకరమైన బహుమతులు ఇచ్చిపుచ్చుకోవాలని ప్రముఖ న్యూట్రిషనిస్ట్ షీలా కృష్ణస్వామి సూచించారు. కాలిఫోర్నియా ఆల్మండ్స్ ఆధ్వర్యంలో వాలంటైన్స్ డే సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాదంతో తయారైన ఆల్మండ్ అమరంత్ కెబాబ్, బాదమ్ మిల్క్ మాజ్.. వంటివి తయారు చేసి ఇష్టమైన వారికి ఇస్తే తద్వారా వారి ఆరోగ్యానికి మేలు చేకూరుతుందన్నారు.

పీఎంఈజీపీపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల విభాగం జనరల్ మేనేజర్ పి.రవీందర్

కాప్రా: ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం(పీఎంఈజీపీ)పై మేడ్చల్ జిల్లా పరిశ్రమల విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఈసీఐఎల్‌లోని ఎన్ఎస్ఐసీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన విభాగం జనరల్ మేనేజర్ పి.రవీందర్ పథకం విధి విధానాలను వివరించారు. కావాల్సిన పత్రాలు, పథకం అమలులో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే నిరుద్యోగ యువతీ, యువకులు ఎంచుకున్న ప్రాజెక్టుపై అవగాహన, మార్కెటింగ్ విధానాలను తెలియజేశారు. పథకంపై సంపూర్ణ అవగాహన పొందినవారు వారు ఉపాధి పొందడంతో పాటు మరికొంత మందికి ఉపాధి కలిగించే స్థాయికి చేరుకుంటారన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు కేవీఐసీ, సీపెట్, ఎన్ఎస్ఐసీ పథకంపై అవగాహన కల్పించడంతో పాటు వారి సంస్థలో ఉన్న ఉపాధి మార్గాలను తెలియజేశారు. కార్యక్రమానికి హాజరైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్, ఏజీఎం, కెనరాబ్యాంక్, లీడ్ బ్యాంక్ మేనేజర్లు రుణం పొందడంపై అవగాహన కల్పించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ, కైలాసగిరి కంచి కామకోటి పీఠం మల్లికార్జునస్వామి ఆలయ 23వ వార్షికోత్సవ శివరాత్రి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గణపతి పూజ కలశాభిషేకం, గోపూజ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన అంకురార్పణ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు జలగం వెంకటేశం, బండారి నీలంరెడ్డి, కుమార్‌గౌడ్, జయమోహన్, ప్రసాద్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరగా రోడ్డు పనులను పూర్తి చేయాలి

మౌలాలి: మౌలాలి డివిజన్ సంతోషిమానగర్‌లో సీసీ రోడ్డు పనులను మంగళవారం మల్కాజిగిరి బీజేపీ సీనియర్ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్ పరిశీలించారు. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శివగౌడ్, వెంకటేష్ నేత, శ్రీనివాస్‌యాదవ్, నటరాజు, రాము, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు ఇచ్చి మరిచిన టీఆర్ఎస్

రామంతాపూర్: రామంతాపూర్ రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి మంగళవారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో పలు వీధుల నుంచి నిర్వహించిన జోడో యాత్రలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, రైతుల భూములకు పరిహారం, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, పోడు భూములకు పట్టాలు, దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూమ్‌లు, నిరుద్యోగులకు భృతి వంటి హామీలను ఇచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. 15 రోజులుగా నిర్వహిస్తున్న జోడో యాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపిందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధులు మేకల శివారెడ్డి, మహ్మద్ తోఫిక్, గిరిబాబు, మురళీగౌడ్, కృష్ణ, సుధాకర్, లూకాస్, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామంతాపూర్‌లో జోడోయాత్ర

ట్యాక్సీ సెక్టార్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తా



కేలండర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: బీఆర్ఎస్‌కేవీ ట్యాక్సీ సెక్టార్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తానని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ వార్డు కార్యాలయంలో బీఆర్ఎస్‌కేవీ ట్యాక్సీ సెక్టార్ కేలండర్‌ను కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంజా రాజు యాదవ్, ఉపాధ్యక్షుడు మహ్మద్ పాషి ముద్దీన్, కార్యదర్శి శివారెడ్డి, గాజులపాటి నరేష్, డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా

మౌలాలి: తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సైనిక్‌పురి డీఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీజన్స్ ఉద్యోగులకు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలని, సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, 50 శాతం తగ్గకుండా పీఆర్‌సీ ఇవ్వాలన్నారు. రాష్ట్ర నాయకులు సీహెచ్.వెంకట్‌రెడ్డి, సర్కిల్ కార్యదర్శి రోండ్ల ఉపేందర్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి మోహన్‌రావు, నరేష్‌గౌడ్, మల్లారెడ్డి, భాస్కర్, కమల, నవీన్, యాదగిరి పాల్గొన్నారు.



మహిళను వేధించిన వ్యక్తికి జైలు

మేడిపల్లి: ఓ మహిళను వేధించిన వ్యక్తికి మొదటి సెషన్ మెట్రో మెజిస్ట్రేట్ ఎల్బీనగర్ కోర్టు వారం రోజుల జైలుశిక్ష విధించింది. పోలీసుల వివరాల ప్రకారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళను వేధించిన బోడుప్పల్ అశోక్‌నగర్ కాలనీకి చెందిన చర్ల గోవర్ధన్‌రెడ్డి స్థానికంగా ఉన్న డెకత్లాన్ స్పోర్ట్స్ షోరూం వద్ద ఓ మహిళను వేధిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి ఎల్బీనగర్ కోర్టులో హాజరుపర్చగా వారం రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురికి రిమాండ్

ఓ వ్యక్తిపై అకారణంగా దాడి చేసి గాయపర్చిన ఘటనలో ముగ్గురు వ్యక్తులను మంగళవారం రిమాండ్‌కు తరలించిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి వివరాల ప్రకారం బోడుప్పల్ అంబేడ్కర్ నగర్ నివాసి ఎడవల్లి భాస్కర్‌పై దేవేందర్ కాలనీవాసులు ముండె కెమిడి లక్ష్మణ్, జన్నె ధర్మయ్య, వాసూరి మహేష్, శోభన్ అనే వ్యక్తులు తాగిన మైకంలో భాస్కర్‌పై శనివారం విచక్షణ రహితంగా దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా మరోవ్యక్తి పరారీలో ఉన్నాడు. ఈ సందర్భంగా మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి విలేకరులతో మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

మల్కాజిగిరి: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జేఎన్టీయూ విశ్రాంత ప్రొఫెసర్ వినయ్‌బాబును గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మండల పరిధిలోని పాఠశాలల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలు తెలిసిన వ్యక్తి వినయ్‌బాబు అని, ఆయను గెలిపించడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు బ్రహ్మాచారి, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు సేవాలాల్ మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్



మంత్రి సత్యవతి రాథోడ్ స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు

మంత్రి సత్యవతి రాథోడ్

కుషాయిగూడ: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ చూపిన మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకొని గిరిజనులంతా ముందుకు సాగాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. చక్రిపురంలో గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సేవాలాల్ సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించి గిరిజనుల ఆత్మగౌరవాన్ని సీఎం కేసీఆర్ పెంచారన్నారు. గత పాలకులు గిరిజనులకు చేసింది శూన్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో గిరిజన గ్రామపంచాయతీల ఏర్పాటు, నగరం నడిబొడ్డున బంజారా భవన్‌ను నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం చొరవతోనే కనీస మౌలిక వసతులు లేని గిరిజన తండాల్లో 24 గంటల విద్యుత్, మిషన్ భగీరథ నీళ్లు, రోడ్ల నిర్మాణాలతో అభివృద్ధి పథంలో నిలిచాయన్నారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్, కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డి, బన్నాల గీతా ప్రవీణ్, లంబాడీ ఐక్యవేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు నాయక్, రాష్ట్ర నాయకులు రాజ్‌కుమార్ జాదవ్, శంకర్‌నాయక్, జగన్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, చందనాయక్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ వేడుకల్లో..

బీఆర్ఎస్ సీనియన్ నేత బండారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి వేర్వేరుగా సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు.

సేవ చేయాలనే సంకల్పం ఉండాలి



మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్మెంటల్ స్టడీస్(ఓయు) ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలోని డోర్నకల్, మహబూబాబాద్, మరిపెడ, తొర్రూర్ పట్టణాల మున్సిపల్ కౌన్సెలర్స్‌కు శిక్షణ తరగతులను నిర్వహించారు. పట్టణ ప్రగతిలో ప్రజాప్రతినిధుల పాత్ర అనే అంశంపై మంగళవారం జరిగిన శిక్షణలో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి పాల్గొని పీర్జాదిగూడ అభివృద్ధిపై పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే మున్సిపల్ చట్టాలు, స్థానిక సంస్థలు, పాలక వర్గాల విధివిధానాలపై సుదీర్ఘంగా వివరించారు. ప్రజల మద్దతు ఉంటేనే మనం ప్రజాప్రతినిధులుగా కీర్తించబడతామని ఆయన స్పష్టం చేశారు. పాల్గొన్న ప్రతినిధులకు సర్టిఫికెట్లను మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రదానం చేశారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

కంటి వెలుగు కార్యక్రమాన్ని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11, 12వ డివిజన్లలో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. డాక్టర్ పి.రామకృష్ణారావు, కార్పొరేటర్లు మద్ది యుగేందర్‌రెడ్డి, అమర్‌సింగ్, కొడె పోచయ్య, డీఈఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకి, టీపీఎస్ రాజీవ్‌రెడ్డి, నాయకులు మనోరంన్‌రెడ్డి, జావీద్‌ఖాన్, రాజరాజు, డాక్టర్ ప్రతిభ, వైద్య సిబ్బంది కాలనీ వాసులు పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

వైభవంగా మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు



పూజల్లో మేయర్ సామల బుచ్చిరెడ్డి తదితరులు

బోడుప్పల్: భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. మలికార్జున స్వామి ఆలయంలో మంగళవారం తోటకూర రవీందర్‌యాదవ్, రేణుక దంపతులచే నిర్వహించిన రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొలుసు తెంపుట, అగ్ని గుండాలు తొక్కుట, ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, భూక్యా సుమన్ నాయక్, కో ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాసాల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శివదీక్షతో శుభాలు అనేకం

రామంతాపూర్: చిన్న చెరువు ప్రాంగణంలోని పాండురంగ స్వామి ఆలయంలో గురుస్వాములు శ్రీధరాచార్యులు, ద్వారప్పచార్యుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజకు మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక నియమ నిబంధనలతో శివదీక్ష మాల ధరిస్తే బోలా శంకరుడైన ఆ శివుడు అనేక శుభాలు కలిగిస్తాడన్నారు. రుషి తపస్వి నర్సింహగిరి స్వామిజీ, శివదీక్ష పారాయణాలు మాలడుగు రమణారెడ్డి, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిర్లింగాల పడిపూజలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్

పరీక్షల సమయంలో ఒత్తిడి వద్దు



మాట్లాడుతున్న షోయబ్ అహ్మద్

మల్కాజిగిరి: ఒత్తిడికి గురికాకుండా పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సాధన చేయాలని ట్రిస్మా(తెలంగాణ రాష్ట్ర స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్) మల్కాజిగిరి అధ్యక్షుడు షేక్ షోయబ్ అహ్మద్ అన్నారు. ఆనంద్‌బాగ్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల కోసం మోటివేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకునే వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టంతో చదువుకొని మంచి మార్కులు సాధించాలన్నారు. అసోషియేషన్ నాయకులు యాదగిరి, నాగరాజు, అజర్‌ఖాన్, ఇన్నారెడ్డి, సయ్యద్ అహ్మద్, భీష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

మల్లాపూర్: రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ అన్నారు. నాచారం రాఘవేంద్రనగర్ కాలనీలో రూ.10 లక్షలతో మంగళవారం చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ త్వరలోనే మిగిలి పోయిన రోడ్లను కుడా వేయనున్నట్లు తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, విఠల్ యాదవ్, రాజబాబు, కట్ట బుచ్చన్నగౌడ్, పాండునాయక్, అనిల్ పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్